ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి
బుధవారం 15 అక్టోబరు 2025 5







బుగులోని జాతర చైర్మన్‌గా రమణారెడ్డి



రేగొండ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : బుగులోని వెంకటేశ్వర స్వామి జాతర చైర్మన్‌గా గంగుల రమణారెడ్డిని నియమించారు. ఈ మేరకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో జాతర చైర్మన్‌గా నియమించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇచ్చిన బాధ్యతను సమర్థంగా నిర్వర్తించేందుకు కృషి చేస్తానన్నారు. జాతరలో కొబ్బరికాయలు విక్రయించే వేలం వాయిదా వేశామని పేర్కొన్నారు.



పారదర్శకంగా

డీసీసీ అధ్యక్షుడి ఎంపిక


ఏఐసీసీ పరిశీలకుడు జాన్సన్ అబ్రహాం

గోవిందరావుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్షుడి ఎంపికకు అధిష్టానం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని ఏఐసీసీ పరిశీలకుడు జాన్సన్ అబ్రహం అన్నారు. దానికి అనుగుణంగానే డీసీసీ అధ్య క్షుడి ఎన్నిక జరుగుతుందని సంఘటన్ సృజన్ అభియాన్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చల్వాయి గ్రామంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అధ్యక్షతన మంగళవారం జరిగిన డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక సన్నాహక కార్యక్రమానికి జాన్సన్ హాజరయ్యారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పార్టీ కోసం ఎంతో కష్టపడి పోరాడిన నాయకులు, కార్యకర్తలకు కాంగ్రెస్ ప్రాధాన్యమిచ్చి బాధ్యతాయుతమైన పదవులు ఇస్తుందన్నారు. డీసీసీ అధ్యక్ష పదవికి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. డీసీసీ ఎంపిక పారద ర్శకంగా ఉంటుందని స్పష్టం చేశారు. డీసీసీ పోటీలో ఎవరైనా ఉండొచ్చన్నారు. ఈ ప్రక్రియలో ఎలాంటి లాబీయింగ్ (మిగతా 8వ పేజీలో)



ఏఐసీసీ ఎన్నికల పరిశీలకుడు జాన్సన్ అబ్రహాంకు నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న అభ్యర్థులు





ఖాళీగా ఎంపీడీవో, సూపరింటెండెంట్ల పోస్టులు

అదనపు బాధ్యతలతోనే సరిపెట్టుకుంటున్న వైనం

స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే కష్టమే..

కీలక విధులు నిర్వర్తించే వారే కరువు



భూపాలపల్లి ఎంపీడీవో కార్యాలయం

ఎలక్షన్లు వస్తే ఎట్లా..?!



కృష్ణకాలనీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మండల పరిషత్ కార్యాలయాల్లో అధికారుల కొరత తీవ్రంగా ఉంది. ముఖ్యంగా ఎంపీడీవోలు, సూపరింటెండెంట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ సమస్య జటిలంగా మారింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కేటాయింపు విషయంపై కోర్టులో వివాదం నడుస్తుండగా ఈ ఎన్నికలు వాయిదా పడిన విషయం విదితమే. వీటికి తాత్కాలికంగా బ్రేక్ పడినా రేపో మాపో అవి జరిగి తీరితే మండల పరిషత్‌లో ఉన్న అధికారుల కొరత తీవ్ర ఇబ్బందికరంగా మారుతుందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

మండల పరిషత్ కార్యాలయాల్లో ముఖ్య భూమిక పోషించాల్సిన ఎంపీడీవో, సూపరింటెండెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాకు సరిపడా మండల పరిషత్ అధికారులు లేకపోవడంతో అదే కార్యాలయాల్లోని కిందిస్థాయి అధికారికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో మండల పరిషత్ కార్యాలయాల్లో పరిపాలన కుంటుపడుతోంది. అదనపు బాధ్యతలతో ఇన్‌చార్జి ఎంపీడీవోలు సతమతమవుతున్నారని తెలుస్తోంది. అలాగే జిల్లా పరిషత్‌లో కూడా కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరోవైపు జిల్లా పరిషత్ సీఈవోగా ఉన్న మహిళా అధికారికి స్థానిక సంస్థల ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్ బాధ్యతలు అప్పగించారు. అదనపు బాధ్యతలు కారణంగా ఆమె సీఈవో పోస్టుకు న్యాయం చేయలేకపోతున్నారని తెలుస్తోంది.

ఎన్నికల విధుల్లో వీరే కీలకం..

స్థానిక సంస్థల నిర్వహణలో ఎంపీడీవోలే కీలకం. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నేతృత్వంలో జిల్లా పరిషత్ సీఈవో పర్యవేక్షణలో ఎంపీడీవోలు, సూపరింటెండెంట్లు, ఇతర పోలింగ్ సిబ్బంది విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. పోలింగ్ బూత్‌లలో సౌకర్యాలు కల్పించడం, బ్యాలెట్ పత్రాలు, ఓటర్ల జాబితా, బాక్సులు, వాహనాలు సిద్ధం చేయడం, నామినేషన్ల స్వీకరణ, అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు తదితర అంశాల్లో ఎంపీడీవోలు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఇంతటి ప్రధాన పోస్టులు జిల్లాలో ఖాళీ ఉండటంతో కింది స్థాయి ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బందులకు గురి కావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలు గనుక జరిగితే వాటిని నిర్వహించేదెవరు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

జడ్పీ సీఈవోనే స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

గతంలో ఇక్కడ స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్‌గా పని చేసిన ఎం. వెంకటేశ్వర్లు 2024 ఆగస్టు 1న ఉద్యోగ విరమణ పొందారు. జిల్లా పరిషత్ సీఈవోగా ఉన్న విజయలక్ష్మి అప్పటి నుంచి స్థానిక సంస్థల ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఎన్నికల జరగునున్న నేపథ్యంలోనూ నేటికీ జిల్లాలో పూర్తిస్థాయి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నియామకం జరగలేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అదనపు కలెక్టర్, జిల్లా పరిషత్ సీఈవో విధులు రెండూ కీలకం. ఈ నేపథ్యంలో రెండు బాధ్యతలు ఒక్కరే నిర్వర్తించడం అంత సులభం కాదనే వాదన వినిపిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థంగా నిర్వహిస్తామని చెబుతున్న అధికారులకు ఇదెలా సాధ్యమనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మరోవైపు జిల్లా పరిషత్‌లో ఉండాల్సిన డిప్యూటీ సీఈవో పోస్టు సైతం ఖాళీగానే ఉంది. ఈ పోస్టుకైతే అసలు ఇన్‌చార్జిని కూడా నియమించలేదు.


జిల్లాలోని ఖాళీలు ఇవే..

జిల్లా వ్యాప్తంగా 12 మండలాలు ఉన్నాయి. వీటిల్లో ఏడు మండలాలకు ఎంపీడీవోలు ఉండగా మిగిలిన నాలుగు మండలాలకు లేరు. దీంతో ఆయా మండలాల్లో ఎంపీవోలుగా విధులు నిర్వర్తిన్న వారికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. భూపాలపల్లి, మహాముత్తారం, మల్హర్, పలిమెల మండలాల్లో ఎంపీవోలే ఇన్‌చార్జి ఎంపీడీవోలుగా కొనసాగుతున్నారు. దీంతో ఎంపీవో విధుల్లో పారదర్శకత కొరవడుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. వీటితో పాటు జిల్లాలో ఐదు సూపరింటెండెంట్ పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయి. జిల్లా పరిషత్ కార్యాలయంలోని సూపరిండెంటెంట్ ఒకటి, మహదేవపూర్ ఒకటి పలిమెల ఒకటి, టేకుమట్ల ఒకటి, చిట్యాల ఒకటి ఖాళీగా ఉండటంతో ఆయా కార్యాలయాల్లోని సీనియర్ అసిస్టెంట్లు సూపరింటెండెంట్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని తెలుస్తోంది.

నేడు సీఎం రాక



- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి 'మాతృయజ్ఞం' కార్యక్రమానికి హాజరు 8
- హనుమకొండలో 1.15 నుంచి 1.45 గంటల వరకు గడపనున్న సీఎం





పాఠశాలల పరిశీలన బృందాల ఏర్పాటు వద్దు

డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నేతలు

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పరిశీలన బృందాల ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.అశోక్, తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిని మెరుగుపరిచేందుకు పనిచేసే ఉపాధ్యాయులను పరిశీలను పంపించడం విడ్డూరమని విమర్శించారు. .రాష్ట్ర వ్యాప్తంగా 168 బృందాలను ఏర్పాటు చేయడం ద్వారా 1473 మంది ఉపాధ్యాయులు బడికి దూరం అవుతారని, దీంతో పాఠాలు చెప్పేవారు లేక విద్యార్థులు వెనుకబాటుకు గురయ్యే దుస్థితి వస్తుందని తెలిపారు. ఈప్రక్రియను విరమించుకొని శాశ్వత పర్యవే క్షణ అధికారులను నియమించాలని కోరారు.

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండ



లక్ష్మి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కాటారం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మండలంలోని ఒడిపిలవంచ, గుమ్మళ్లపల్లి గ్రామాల్లో మంత్రి మంగళవారం పర్యటించారు. ఇటీవల పత్తి చేనులో కూలికి వెళ్లి పిడుగుపాటుతో మృతి చెందిన ఇసునం లక్ష్మి కుటుంబ సభ్యులను, అస్వస్థత పాలైన కంకణాల బక్కిరెడ్డి, లత, భూదమ్మ తదితరులను పరామర్శించారు. లక్ష్మి కుటుంబానికి ప్రభుత్వపరంగా, వ్యక్తిగతంగా అండదండలు అందిస్తానన్నారు. ఇటీవల మృతిచెందిన సుకాసి కిష్టయ్య కుటుంబాన్ని కూడా పరామర్శించారు. మాజీ ఎంపీటీసీ గోసిక లింగయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వంశవర్ధన్‌రావు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ కోడి రవికుమార్, లత, తెప్పల దేవేందర్‌రెడ్డి, చీర్ల తిరుపతిరెడ్డి, జాడి మహేశ్వరి, నాయకులు చీర్ల తిరుపతిరెడ్డి, కంకణాల శ్రీనివాస్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, సురేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీధర్, బాలయ్య, సత్యానారాయణ, రమేష్‌రెడ్డి, ఉంసింగ్, శకుంతల తదితరులు పాల్గొన్నారు.









బెస్ట్ అవైలబుల్ విద్యకు ఇబ్బందులు కలిగించొద్దు

వీసీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



వీసీలో పాల్గొన్న కలెక్టర్

జనగామ కల్చరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యార్థులకు విద్యా బోధనలో ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించారు. మంగళవారం హైద్రాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి వీసీలో మాట్లాడారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ఉన్న ఇబ్బందుల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాముఖ్యత ఇస్తుందన్నారు. బడుగు, బలహీన వర్గాల పిల్లలకు మెరుగైన, మౌలిక వసతులతో కూడిన విద్యాబోధన అందించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రిజ్వాన్ బాషా, డీఎస్సీడీవో విక్రమ్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

సీఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంపెట రాజయ్య

కృష్ణకాలనీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని సీఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంపెట రాజయ్య డిమాండ్ చేశారు. భూపాలపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రిని ఆయన మంగళవారం సందర్శించారు. ఆస్పత్రికి వచ్చే కార్మికులకు సరైన వైద్యం అందడం లేదని, దీంతో వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సరిపడా సిబ్బంది లేదకపోవడంతో వైద్యం సకాలంలో అందడం లేదన్నారు. గైనకాలజిస్టు లేకపోవడం వల్ల మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నెలవారీ మందులను 15 రోజులకు మాత్రమే ఇస్తున్నారని, దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఆస్పత్రి నిర్వహణపై సింగరేణి యాజమాన్యం దృష్టి పెట్టి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

దినసరి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దావూద్, రాజేందర్

ఏటూరునాగారం రూరల్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో విధులు నిర్వర్తిస్తున్న దినసరి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎమ్డీ దావూద్, రత్నం రాజేందర్ డిమాండ్ చేశారు. 33 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం దారుణమని విమర్శించారు. ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట దినసరి కూలీల సమ్మె శిబిరాన్ని వారు సోమవారం సందర్శించారు. కార్మికులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దినసరి కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సమ్మె చేపడుతున్న వారితో కనీసం చర్చలు కూడా జరపడం లేదని విమర్శించారు. దినసరి కార్మికులతో గిరిజన సంక్షేమ శాఖ దశాబ్దాలుగా వెట్టి చాకిరీ చేయించుకుంటూ కనీసం సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో దినసరి వేతన కార్మికులు నాగలక్ష్మి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కార్మికుల సమ్మెకు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మద్దతు తెలిపింది.



ఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తున్న దినసరి వేతన కార్మికులు, సీఐటీయూ నాయకులు



చిట్యాలలో నిరాహార దీక్షలో ఏబీవీపీ నాయకులు

ఏబీవీపీ నాయకుల నిరాహార దీక్ష

చిట్యాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిరాహార దీక్షను చేపట్టారు. ఈసందర్భంగా ఏబీవీపీ ప్రాంత హాస్టల్స్ ఇన్‌చార్జి వేల్పుల రాజ్‌కుమార్ మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్లు పాడయ్యాయన్నారు. మరమ్మతులు చేయించకపోవడంతో విద్యార్థులు బయటకు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. మండల కేంద్రంలో నిర్మించిన బస్టాండ్‌ను వెంటనే ప్రారంభించాలని, అలాగే ప్రభుత్వ పాఠశాలకు సమీపంలో ఉన్న వైన్స్, బెల్టుషాపులను తొలగించాలని డిమాండ్ చేశాడు. మారుమూల ప్రాంత విద్యార్థుల కోసం ఇంటిగ్రేటెడ్ కళాశాల వసతి ఏర్పాటు చేయాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ స్పందించి వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మైదం శ్రీకాంత్ నిరాహార దీక్షను ప్రారంభించగా ఏబీవీపీ నగర కార్యదర్శి ముష్కె అజయ్, కళాశాల అధ్యక్షుడు కౌషిక్, శశివర్ధన్, అభిరామ్, గణేష్, హేమంత్, జయప్రకాశ్, వినయ్, సూరజ్, సాయిచరణ్, కిరణ్, ప్రణయ్, మహేష్, శంకర్, అభినయ్ పాల్గొన్నారు.

ఏపీఆర్వో, ఫొటోగ్రాఫర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఏపీఆర్వో, ఫొటోగ్రాఫర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌కు జర్నలిజంలో గుర్తింపు సంస్థల నుంచి పొందిన డిగ్రీ/జర్నలిజంలో డిప్లొమా చేసి ఉండడంతోపాటు ప్రభుత్వ కార్యక్రమాల కవరేజ్ మొదలగు అంశాలపై అవగాహన ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఫొటోగ్రాఫర్‌కు సంబంధించి డిగ్రీతోపాటు జర్నలిజం, ఫొటోగ్రఫీ డిప్లొమా ఉండాలని, సంక్షేమ పథకాలకు సంబంధించి డాక్యుమెంటరీ తీసేలా పరిజ్ఞానం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 15 నుంచి 17 వరకు డీపీఆర్వో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

22న పుట్టపర్తికి ప్రత్యేక బస్సు

జనగామ కల్చరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని జనగామ నుంచి పుట్టపర్తికి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ జనగామ డిపో మేనేజర్ స్వాతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 సీట్లు గల డీలక్స్ బస్సు నవంబరు 22న సాయంత్రం 5 గంటలకు జనగామ బస్టాండు నుంచి బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 4 గంటలకు పుట్టపర్తికి చేరుకుంటుందన్నారు. చార్జీ ఒక్కరికి రూ.2 వేలు ఉంటుందని, వివరాలకు సేఫ్టీ వార్డెన్ కె.సురేందర్‌ను 9948164847 నంబరులో సంప్రదించాలన్నారు.

రామప్పలో కొనసాగుతున్న వలంటీర్ల శిక్షణ

వెంకటాపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని ప్రఖ్యాత రామప్ప రామలింగేశ్వరస్వామి దేవాలయంలో వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ క్యాంపు ఏడవరోజు మంగళవారం కొనసాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వీరమల్ల ప్రకాశ్ ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ అంశాలపై వలంటీర్లకు అవగాహన కల్పించారు. కాకతీయుల గొలుసుకట్టు చెరువులు, జీవ, సాంస్కృతిక వైవిధ్యం, వాతావరణ మార్పు కారణంతో రాబోయే రోజుల్లో ప్రపంచ వారసత్వ కట్టడాల ఉనికికి ఏ విధమైన ప్రమాదం పొంచి ఉందనే తదితర విషయాలపై అవగాహన కల్పించారు.

కాకతీయ వారసత్వ కట్టడాల పునరుద్ధరణ పను లు, పునర్నిర్మాణం చేయడానికి డాక్యుమెంటేషన్ తదితర అంశాలను కేంద్ర పురావస్తుశాఖ అసిస్టెంట్ ఇంజనీర్ కృష్ణచైతన్య వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ కోఆర్డినేటర్ జనగాం శ్రీధర్‌రావు, టూరిజం అసిస్టెంట్ ప్రమోటర్ డాక్టర్ సూర్యకిరణ్, యోగా గురువు రాంబాబు, వలంటీర్లు పాల్గొన్నారు.



వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న ప్రకాష్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్

కాటారం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ డిమాండ్ చేశారు. మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మంగళవారం టీఆర్‌టీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ టీఆర్‌టీఎఫ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ముందు వరసలో ఉండి పోరాడుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలన్నారు. స్థానికత ఆధారంగా జీవో 317 బాధితులందరికీ న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించి ఉపాధ్యాయులు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో టీఆర్‌టీఎఫ్ జిల్లా, మండల స్థాయి నాయకులు హట్కర్ సమ్మయ్య, పరంసింగ్, బెజుగం సతీష్, హట్కర్ రమేష్‌నాయక్, పీర్ల మోహన్‌రావు, రేపాల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేస్తున్న టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్

రెండు తలల గొర్రెపిల్ల జననం



రెండు తలల గొర్రెపిల్లను చూపుతున్న మండల పశువైద్యాధికారి

నర్మెట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వెల్దండలో ఓ వింత చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శ్రీపతి కుమార్‌కు చెందిన ఓ గొర్రెకు రెండు తలల గొర్రెపిల్ల మంగళవారం జన్మించింది. రెండు తలలు నాలుగు కళ్లు, నాలుగు కాళ్లు ఉన్నాయి. రెండు తలలతో పుట్టిన గొర్రె పిల్లను చూడడానికి స్థానికులు తరలివచ్చారు. పశువైద్యాధికారి కొర్ర జితేందర్ మాట్లాడుతూ జన్యుపరమైన లోపాలతో ఇలా గొర్రెలకు ఇలా రెండు తలలతో గొర్రె పిల్లలు జన్మిస్తాయని తెలిపారు. జన్యులోపాలతో జన్మించడంతో పుట్టిన గంట వ్యవధిలోనే చనిపోయింది.

పూర్తిగా నిలిచిన బొగ్గు రవాణా

కాంట్రాక్టు లారీలను అడ్డుకున్న టిప్పర్ అసోసియేషన్

కృష్ణకాలనీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియాతో పాటు తాడిచర్ల ఓసీ నుంచి తరలించే బొగ్గు రవాణా పూర్తిగా నిలిచిపోయింది. తమకు చెల్లిస్తున్న చార్జీలు పెంచాలని డిమాండ్‌తో సమ్మెబాట పట్టిన టిప్పర్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం అన్ని లారీలను అడ్డుకున్నారు. సింగరేణి కాంట్రా క్టు లారీలను సైతం అడ్డుకోవడంతో బొగ్గు రవాణా నిలిచిపోయింది. ఓసీ-2, ఓసీ-3తో పాటు తాడిచర్ల నుంచి కేటీపీపీకి, గోదావరిఖని, ఉప్పల్‌కు బొగ్గు రవాణా నిలిచిపోయింది. యాజమాన్యం, సంబంధిత కాంట్రాక్టర్లతో చర్చలు జరిపినప్పటికీ తమ డిమాండ్లపై సానుకూల స్పందనరాలేదని, న్యాయమైన డిమాండ్ల పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె విరమించబోమని టిప్పర్ అసోసియేషన్ అధ్యక్షుడు రోడ్డ రవీందర్ వెల్లడించారు.

ఈ సమ్మెలో అసోసియేషన్ సభ్యులు పుట్ట రవీందర్, కప్పాల ప్రభాకర్, సబ్బాని వెంకన్న, జంగపల్లి రాజమల్లు, గుపల రాములు, మేకల చంద్రయ్య, కొండ శ్రీనివాస్, చెరుకుతోట శ్రీరాములు, పుట్ట సంపత్, చెక్క శంకర్, బొడ్డు కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఓసీ-2 ఎదుట ఆందోళన చేస్తున్న లారీ యజమానులు

అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

● ఏవైఎస్ రాష్ట్ర నాయకుడు మల్లయ్య

చిట్యాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దామని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య అన్నారు. అంబేద్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించిన దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలో బుద్ధుడు చిత్రపటం, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈసందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ గౌతమ బుద్ధుడి బోధనలు, సూక్తులు, సిద్ధాంతాలకు ఆకర్షితుడైన అంబేద్కర్ సుమారు 5 లక్షల మందితో బౌద్ధ మతాన్ని స్వీకరించారని తెలిపారు. కార్యక్రమంలో ఏవైఎస్ మండల అధ్యక్షుడు జన్నె యుగందర్, సంఘం నాయకులు గడ్డం సదానందం, కట్కూరి మొగిళి, చందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు

భూపాలపల్లి కలెక్టరేట్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు నివారణ టీకాలను బుధవారం వేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి కుమారస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 12 మండలాల్లో మొత్తం 1,32,185 పశువులకు ఈ నెల 15ఎ నుంచి నవంబరు 14 వరకు ఈ టీకాలకు వేయనున్నట్లు పేర్కొన్నారు. 69,427 ఆవులు, 62,758 గేదెలకు టీకాలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. టీకాలు వేసేందుకు 22 బృందాలను ఏర్పాటు చేశామని, రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జనగామ జిల్లాలో..

రఘునాథపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలో నేటి నుంచి నవంబరు 14 వరకు పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల పశు వైద్యాధికారి ఎస్.కె.అనీఫ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం మాట్లాడుతూ 15 నుంచి 17 వరకు కోమల్ల, రఘునాథపల్లి, నిడిగొండ గ్రామాలలో, 18 నుంచి 20 వరకు గోవర్ధనగిరి, ఖాంజీపేట, ఫతేషాపూర్, 21 నుంచి 23 వరకు కుర్చపల్లి, వెల్ది, ఇబ్రహీంపూర్, 24 నుంచి 27 వరకు అయ్యవారిగూడెం, ఎల్లారెడ్డిగూడెం, శ్రీమన్నారయణపురంలో టీకాలు వేయడం జరుగుతుందన్నారు. అలాగే 28 నుంచి 30 వరకు అశ్వరావుపల్లి, కంచనపల్లి, లక్ష్మితండా, నవంబరు 1 నుంచి 4 వరకు గబ్బెట, మిగిలిన గ్రామాలు, 5 నుంచి 14 వరకు టీకాలు వేస్తామన్నారు.

● నర్మెట(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా నేటి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి కొర్ర జితేందర్‌నాయక్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 15 నుంచి వచ్చే నెల 14 వరకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. బుధవారం మాన్‌సింగ్‌తండాలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.

రూ.45 లక్షల టోకరా

● తన ఇంట్లో లంకె బిందులు దొరికాయని నమ్మించిన మహిళ
● తక్కువ ధరకే బంగారం ఇస్తానని ఆశ.. ● ఇద్దరు మహిళల నుంచి డబ్బులు వసూలు
● ఇప్పటికే సదరు మహిళపై కేసులు ● జనగామ జిల్లా గూడూరులో ఘటన

పాలకుర్తి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తన ఇంట్లో లంకె బిందెలు ఉన్నాయని, ఆ బంగారాన్ని తక్కువ ధరకే విక్రయిస్తానని నమ్మించి రూ.45లక్షల వరకు ఇద్దరు మహిళలకు ఓ మహిళ టోకరా వేసింది. ఈ ఘటన మంగళవారం జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరులో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.

గ్రామానికి చెందిన సింగపురం గౌరమ్మ అనే మహిళ ఇటీవల గ్రామంలో కొత్త ఇల్లు నిర్మించుకుంది. ఇంటి నిర్మాణానికి పెద్ద మొత్తంలో ఖర్చు కాగా, అమాయకుల నుంచి డబ్బులు వసూలు చేయాలని ఎత్తులు వేసింది. తమ ఇంట్లో లంకె బిందెలు ఉన్నాయని స్థానికులను నమ్మించింది. అదే క్రమంలో గ్రామానికి చెందిన మంద రజిత వ్యవసాయం చేస్తూ జీవిస్తుండగా, కొండపర్తి గౌతమి కులవృత్తి (కౌసాలి) చేసుకుంటూ జీవిస్తున్నారు. రజిత, గౌతమిపై తన ప్లాన్ అమలుకు ఎంచుకుంది. వారిని కలిసి తాను కొత్తగా నిర్మించుకున్న ఇంటిలో లంకె బిందెలు దొరికాయని, దానిలో పెద్ద మొత్తంలో బంగారం దొరికిందని తెలిపింది. మీర అప్పులు కాబట్టి మార్కెట్లో ఉన్న ధర కంటే తక్కువ ధరకు బంగారం ఇస్తానని నమ్మబలికింది. బంగారంపై ఆశతో అమాయక అందినకాడాల్లా అప్పులు చేసిన మంద రజిత రూ. 20లక్షలు, కొండపర్తి గౌతమి రూ.25 లక్షలు కలిపి గౌరమ్మకు ముట్టజెప్పారు. డబ్బులు తీసుకుని మూడు నెలలైనా బంగారం ఇవ్వకపోవడంతో గౌరమ్మపై ఒత్తిడి చేశారు. దీంతో ఆమె అడిగిన ప్రతీసారీ దాటవేస్తూ వచ్చింది.

దీంతో తాము మోసపోయామని భావించిన రజిత మంగళవారం పోలీసులను ఆశ్రయించింది. తమకు జరిగిన అన్యాయంపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కాగా, గౌరమ్మపై గతంలోనూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులు ఉన్నాయని తెలిసింది. ఈ ఘటనపై ఎస్సై లింగారెడ్డిని వివరణ కోరగా, మహిళలు జరిగిన మోసంపై ఫిర్యాదు అందిందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఆయన తెలిపారు.

17న విద్యుత్ వినియోగదారుల కోర్టు

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలో విద్యుత్ సమస్యలపై వినియోగదారుల కోసం టీజీఎన్‌పీడీసీఎల్ కార్యాలయం ఆవరణలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసినట్లు ఏఈ విశ్వాస్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 17న దీనిని భూపాలపల్లిలో ఏర్పాటు చేశామన్నారు. ఈ కోర్టులో వినియోగదారులు తమకు గల సమస్యలను నేరుగా వచ్చి రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే అప్పటికప్పుడు పరిష్కారం చూపెడుతారని తెలిపారు. ఇందులో విద్యుత్ పునఃరుద్ధరణ పనులు, మీటర్లలో హెచ్చుతగ్గులు, వోల్టేజీలలో హెచ్చుతగ్గులు, నూతన సర్వీసులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ తదితర సమస్యలపై దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కోర్టు ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి వినియోగదారుల ఫోరం చైర్మన్ వేణుగోపాలచారి హాజరుకానున్నట్లు తెలిపారు.

ఎదురెదురుగా ఢీకొన్న కార్లు

కృష్ణకాలనీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాకేంద్రం జాతీయ రహదారిపై ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. దీంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లాకు చెందిన దేవరాజు జయలక్ష్మి భూపాలపల్లి జిల్లా కోర్టులకు కారులో వచ్చింది. కారును జడ్ల తిరుపతి నడుపుతుండగా మార్గమధ్యలో బాంబులగడ్డ సమీపంలో సూర్యాపేట జిల్లాకు చెందిన పిడుగు రమేష్, మామిడి రవి ప్రయాణిస్తున్న కారు ఎదురైంది. లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వెళ్తున్న జయలక్ష్మి కారును ఢీకొంది. దీంతో జయలక్ష్మికి రెండుకాళ్లు విరిగిపోగా, జడ్ల తిరుపతి తలకు గాయైంది.

అలాగే మామిడి రవి కూడా స్వల్పంగా గాయపడ్డాడు. అతివేగంతో వచ్చి తమ కారును ఢీకొట్టారని తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేష్‌కుమార్ వెల్లడించారు. క్షతగాత్రులను తొలుత వంద పడకల ఆస్పత్రిలో చికిత్స అందిం చారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించినట్లు తెలిసింది.




గాయపడిన దేవరాజు జయలక్ష్మి, జడ్ల తిరుపతి

ఈ ఏడాదికి డిగ్రీ కోర్సులన్నింటికి పాత ఫీజులే..

కేయూ క్యాంపస్ అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ నాన్ ప్రొఫెషనల్ కోర్సులకు 2024-25 ఏడాదికి ఉన్న ఫీజులనే 2025-26 ఏడాదికి కొనసాగుతాయని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కామన్ సర్వీస్, పరీక్షల ఫీజులను కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థులకు ఫీజుల విషయాన్ని తెలపాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఫీజుల పెంపుపై ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని సూచించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ వేస్తుండగా ప్రమాదం

సమాచారమిచ్చినా స్పందించని అధికారులు

జనగామ జిల్లా రామచంద్రగూడెంలో విషాదం

లింగాలఘణపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజ్ వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై రైతు మృతిచెందిన ఘటన మంగళవారం జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం రామచంద్రగూడెంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం. గ్రామానికి చెందిన కొత్త సుధాకర్‌రెడ్డి (65)కి భార్య శోభారాణి, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.

రెండు రోజుల క్రితం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో సుధాకర్‌రెడ్డి వ్యవసాయ బావి వద్ద ఉన్న ఎస్ఎస్-22 ట్రాన్స్‌ఫార్మర్‌పై 11కెవీ ఎగ్ ఫ్యూజులు కాలిపోయాయి. దీంతో పంపుసెట్లు నడవకపోవడంతో పొలానికి నీళ్లు పారించడం ఇబ్బందిగా మారింది. అయితే తానే ట్రాన్స్‌ఫార్మర్‌పై ఫ్యూజ్ వేసేందుకు ఏబీ(ఎయిర్ బ్రేక్) స్విచ్ బంద్ చేసే క్రమంలో ఏబీ స్విచ్ ఇన్సులేటర్లు పూర్తిస్థాయిలో ఓపె న్ కాలేదు.



సుధాకర్‌రెడ్డి(ఫైల్)

ఈవిషయాన్ని గమనించలేకపోయిన సుధాకర్‌రెడ్డి ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కడంతో షాక్‌కు గురై కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద ఘటనపై స్థానికులు విద్యుత్‌శాఖాధికారులకు సమాచారం చేరవేసినా ఘటనా స్థలానికి రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు సమాచారం ఇవ్వకుండానే సుధాకర్‌రెడ్డి ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కాడా..? లేదా సమాచారం ఇచ్చినా క్షేత్రస్థాయి అధికారులు స్పందించలేదా..? అనే పూర్తి విషయాలు తెలియాల్సి ఉంది. విషయం తెలుసుకున్న ఎస్సై బండి శ్రవణ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు.

పాకాల పంట పొలాల్లో మొసళ్లు

మత్తడి పోసిన సమయంలో బయటకు వస్తున్న వైనం

- సరస్సులో ప్రస్తుతం 200కు పైగా మొసళ్లు ఉన్నాయంటున్న అటవీశాఖ
- పొలాలకు వెళ్లేందుకు భయపడుతున్న రైతులు
- కనిపిస్తే సమాచారం ఇవ్వాలంటున్న అటవీశాఖఅధికారులు

ఖానాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పాకాల సరస్సు మొసళ్లకు ఆవాస ప్రాంతం. సరస్సులో సేద తీరాల్సిన మొసళ్లు ఇటీవల పాకాల ఆయకట్టు పంటపొలాలు, పంట కాలువలు, వ్యవసాయ బావుల్లో ప్రత్యక్షమవుతుండడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ పనుల కోసం ప్రతినిత్యం రాత్రనక, పగలనక రైతులు పంట పొలాల్లోకి వెళుతుంటారు. పంటలకు సాగునీటిని అందించే క్రమంలో పంట కాలువల్లోకి సైతం దిగుతుంటారు. మొసళ్ల సంచారం ఎక్కువవడం మూలంగా ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

మత్తడి ప్రవాహంలో బయటికి..

కొన్నేళ్లుగా ప్రతి ఏటా పాకాల సరస్సు మత్తడి పోస్తున్నది. వర్షాకాలం భారీ వర్షాలకు సరస్సు ఉధృతంగా మత్తడి పోస్తున్న సందర్భంలో నీటి ప్రవాహానికి ఎదురుగా వెళ్లలేని మొసళ్లు మత్తడి గుండా బయటికి వెళుతున్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. అదేవిధంగా పాకాల సంగెం, తుంగబంధం తూముల ద్వారా అరుదుగా మొసలి పిల్లలు బయటికి వెళుతున్నట్లు చెబుతున్నారు. మత్తడి నీటి ప్రవాహం గుండా తూముల ద్వారా బయటికి వచ్చిన మొసళ్లు ప్రధానంగా పాకాల వాగు, తుంగబంధం, సంగెం పంట కాలువల్లో సేద తీరుతుంటాయి.

పంట కాలువల్లో నీటి ప్రవాహం తగ్గినప్పుడు కాలువల వెంబడి అనుసంధానంగా ఉన్నటువ్యవసాయ బావులలోకి వెళుతుంటాయి. ఇదే సమయంలో కొన్ని సందర్భాలలో పంటచేలలో ప్రత్యక్షమవుతున్నాయని అటవీ అధికారులు తెలుపుతున్నారు. పంట పొలాల్లోకి వచ్చే మొసళ్లతోనే రైతులు ఎక్కువగా భయాందోళనకు గురవుతున్నారని, పంట కాలువల్లో నీటి ప్రవాహం తగ్గిన సమయంలో కాలువల వెంబడి పొలాలు ఉన్న రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు సూచిస్తున్నారు.



కొత్తూరు శివారు పంటపొలాల్లో ప్రత్యక్షమైన మొసలి (ఫైల్)

రెస్క్యూ టీం ఏర్పాటు

పాకాల సరస్సు గుండా బయటికి వచ్చిన మొసళ్లనే కాకుండా నర్సంపేట డివిజన్ వ్యాప్తంగా ఎక్కడ మొసళ్లు కనిపించినా పట్టుకుని పాకాల సరస్సులో వదిలివేయడానికి నర్సంపేట అటవీశాఖ ఆధ్వర్యంలో బేస్‌క్యాంప్‌కు చెందిన ఐదుగురు సభ్యులతో రెస్క్యూ టీంను ఏర్పాటు చేశారు. గత సంవత్సర కాలంలో ఖానాపురం, నర్సంపేట, చెన్నారావుపేట మండలాల పరిధిలో 13 మొసళ్లను బంధించి పట్టుకుని సరస్సులో వదిలివేసినట్లు అటవీ అధికారులు తెలిపారు.

200కు పైగా మొసళ్లు

గత సంవత్సరం పాకాల సరస్సులోని మొసళ్ల సంఖ్యను నిర్ధారించి జియోట్యాగింగ్ చేసేందుకు అటవీశాఖ అధికారులు సర్వే నిర్వహించారు. సరస్సులో 200కు పైగా మొసళ్లు ఉన్నాయని, అందులో 60 నుంచి 70 మొసళ్లు గుడ్లు పెట్టి సంతానం పెంచేవిగా ఉన్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. అదేవిధంగా సరస్సులో మొసళ్ల సంఖ్య ఏటా 20 వరకు పెరుగుతున్నాయని, కానీ, అదే సంఖ్యలో సరస్సు నుంచి బయటికి సైతం వెళుతున్నట్లు అధికారులు గుర్తించారు. బయటికి వచ్చిన మొసళ్లు పంట కాలువలు, పొలాలు, వ్యవసాయ బావులలో ప్రత్యక్షమవుతున్నాయి.



పంటపొలాల్లో కనిపించిన మొసలిని బంధించిన రెస్క్యూ టీం (ఫైల్)

మొసళ్లను చంపొద్దు



పంట పొలాల్లో, పంట కాలువల్లో, వ్యవసాయ బావుల్లో మొసళ్లు కనిపిస్తే చంపకూడదు అటవీ అధికారులకు సమాచారం అందిస్తే గంట వ్యవధిలోనే రెస్క్యూ టీం సభ్యులు వెళ్లి పట్టుకుని పాకాల సరస్సులో వదిలివేస్తారు. భవిష్యత్‌లో సరస్సు నుంచి మొసళ్లు బయటికి రాకుండా ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తున్నాం. ఇప్పటివరకు పంట పొలాల్లో కనిపించే మొసళ్లతో ప్రాణహాని జరగలేదు. అయినప్పటికీ పంట కాలువల్లో నీరు తగ్గినప్పుడు సమీప పొలాల రైతులు అప్రమత్తంగా ఉండాలి.

– రవికిరణ్, ఎఫ్‌ఆర్వో నర్సంపేట

మొసళ్లను పట్టుకోవడం రిస్కే..



మొసళ్లను బంధించడం చాలా రిస్క్‌తో కూడున్నది. అయినప్పటికీ చాలా జాగ్రత్తగా రక్షణ చర్యలు తీసుకుంటూ వాటిని పట్టుకుంటాం. 25 కిలోల లోపు ఉన్న మొసళ్లతో ఇబ్బంది పెద్దగా ఉండదు. 70, 80 కిలోలు ఉన్న మొసళ్లను బంధించాలంటే చాలా కష్టపడాల్సి ఉంటుంది. సంవత్సరం నుంచి 13 మొసళ్లను పట్టుకుని పాకాల సరస్సులో వదిలాం.

– నాగరాజు (బేస్‌క్యాంప్ పాకాల) రెస్క్యూ టీం సభ్యుడు



జనగామ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు (ఫైల్)

ఇలాగైతే 'బెస్ట్' ఎలా!?

- బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు పేరుకుపోతున్న బకాయిలు
- బిల్లుల పెండింగ్‌తో విద్యార్థులను అనుమతించని యాజమాన్యాలు
- అధికారుల చుట్టూ విద్యార్థుల తల్లిదండ్రుల ప్రదక్షిణలు
- నిర్వహణ కష్టంగా మారిందంటున్న యాజమాన్యాలు

జనగామ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల పెండింగ్ ఫీజు బకాయిల సమస్య విద్యార్థులకు శాపంగా మారింది. ప్రభుత్వం నుంచి మూడునాలుగేళ్లుగా బిల్లులు రాకపోవడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బకాయిని సాకుగా చూపుతూ పాఠశాలల యాజమాన్యాలు కొన్ని చోట్ల విద్యార్థులను స్కూళ్లకు అనుమతించడం లేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో కలెక్టరేట్‌ల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. పలు జిల్లాల్లో కలెక్టర్, విద్యాశాఖ అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నారు. నెల రోజులుగా తల్లిదండ్రులు ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రావడం లేదు.

32 వేల మంది విద్యార్థులు

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 227 స్కూళ్లలో సుమారు 32 వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో బెస్ట్ అవైలబుల్ స్కూల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గతంలో బ్రైట్ బాయ్స్ స్కీమ్ కింద ఉన్న ఈ పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ కింద మార్చారు. ఈ స్కీమ్ కింద ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కూల్ కింద ఎంపికైన స్కూళ్లలో ప్రవేశాలు కల్పిస్తారు. సీట్ల ఖాళీల కంటే ఎక్కువ ఉంటే డ్రా పద్ధతిన సీట్లను భర్తీ చేస్తారు. ఎంపికైన స్కూల్‌లో మొదటి తరగతిలో 20 సీట్ల చొప్పున కేటాయిస్తారు. అలా పదవ తరగతి వరకు 20 సీట్ల చొప్పున కేటాయింపులు ఉంటాయి. ఒక్కో విద్యార్థికి డే స్కాలర్‌కు రూ. 28వేలు, రెసిడెన్షియల్ విద్యార్థికి రూ.42వేల చొప్పున ప్రభుత్వం అందిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా 227 స్కూళ్లలో దాదాపు 32వేల మంది ఎస్సీ ఎస్టీ విద్యార్థులు చదువుతున్నారు.

అనుమతించని యాజమాన్యాలు

పెండింగ్ బిల్లులను సాకుగా చూపుతూ విద్యార్థులను స్కూళ్ల యాజమాన్యాలు అనుమతించడం లేదు. కొన్ని స్కూళ్ల మేనేజ్‌మెంట్లు విద్యార్థులను పాఠశాలకు రావొద్దంటూ తెగేసి చెబుతున్నారు. తోటి విద్యార్థుల ముందే తమను పాఠశాలకు రావొద్దని చెబుతుండడంతో పిల్లలు మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. కొన్ని చోట్ల రెసిడెన్షియల్ యాజమాన్యాలు తాము హాస్టల్, భోజనం, వసతి కల్పించలేమని, కావాలంటే చదువు మాత్రం చెబుతామంటూ తెగేసి చెబుతున్నారు. మూడు, నాలుగేళ్లుగా ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి రాకున్నా భోజనం, వసతి కల్పించామని, ఇక తమ వల్ల కాదని అంటున్నాయి. దీంతో తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. పిల్లలను అనుమతించకపోవడంతో తల్లిదండ్రులు చేసేదేమీ లేక ఆందోళనలకు దిగుతున్నారు. కలెక్టరేట్ల ఎదుట ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేసి అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమ పెండింగ్ బకాయిలు విడుదల చేసి తమ పిల్లల చదువులకు మార్గం సుగమం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

రూ. 180 కోట్ల బకాయిలు

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు సుమారు రూ.180 కోట్ల పెండింగ్ బిల్లులు రావాల్సి ఉంది. బీఆర్ఎస్ హయాంలో రెండేళ్ల బకాయిలు పెండింగ్ ఉండగా కాంగ్రెస్ వచ్చిన తర్వాత రెండేళ్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు యాజమాన్యాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో కొన్ని స్కూళ్లకు నాలుగేళ్ల బకాయిలు ఉండగా కొన్ని స్కూళ్లకుమూడేళ్లుగా బకాయిలు ఉన్నట్లు చెబుతున్నారు.పెండింగ్ బిల్లులకు సంబంధించి టోకెన్ జారీ చేసినప్పటికీ బిల్లులను మాత్రం ప్రభుత్వం రిలీజ్ చేయడం లేదని యాజమాన్యాలు అంటున్నాయి. కేవలం రూ.180కోట్ల పెండింగ్ బిల్లులను రిలీజ్ చేయకపోవడంతో ఇటు తమకు, అటు విద్యార్థులకూ నష్టం కలుగుతోందని అంటున్నారు. పెండింగ్ ఉండడం వల్ల పాఠశాలల నిర్వహణ తమకు భారంగా మారుతోందని అంటున్నారు.



ట్రాక్టర్‌కు అనుసంధానం చేసిన ఎడ్లబండిలో కూలీలను తీసుకెళ్తున్న రైతు చెవ్వల్ల రాజు

ఎద్దులు పోయి ఇంజన్ వచ్చే..

వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పై చిత్రాన్ని చూడండి.. ఎడ్లు తీసుకెళ్లాల్సిన బండిని ట్రాక్టర్ లాగుతోందని అనుకుంటున్నారా! అవును ట్రాక్టర్‌కు ట్రాలీ డబ్బాను కాకుండా పాత ఎడ్ల బండిని అనుసంధానం చేసి ప్రయాణిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు ఓ రైతు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని కట్ర్యాల గ్రామానికి చెందిన రైతు చెవ్వల్ల రాజు ఈ ఐడియాను సృష్టించాడు. మంగళవారం గ్రామంలో వ్యవసాయ బావి వద్దకు కూలీలను తీసుకెళ్తుండగా ఈ చిత్రం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది. రాజుకు ఐదెకరాల భూమి ఉండగా, మరో నాలుగెకరాలు కౌలుకు చేస్తున్నాడు. భార్య, ముగ్గురు పిల్లలతో పాటు అప్పుడప్పుడు కూలీలను తీసుకెళ్లేందుకు దీనిని ఉపయోగిస్తున్నాడు. ఆటోలో కూలీలను తరలించడానికి ఖర్చు ఎక్కువగా ఖర్చు అవుతున్నట్లు చెప్పాడు.





చిర్ర కిరణ్

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని కట్ర్యాల గ్రామంలో బోరు బావి నుంచి పైకి వస్తున్న నీరు

ఉబికి వస్తున్న గంగమ్మ

15 ఏండ్ల క్రితం వేసిన బోరు నుంచి నీరు పైకి

వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : 200 ఫీట్ల లోతు వరకు వేసిన బోరు బావి, వేసిన 15 ఏళ్లలో ఏనాడు సరిగా పోయని నీరు, రెండు రోజుల నుంచి బోరు బావి నుంచి గంగమ్మ ఉబికి వస్తోంది. దీంతో ఆ రైతు ఆశ్చర్య పోయాడు. ఆగి పోసే బోరు నుంచి ఏకంగా పైకి నీరు రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. ఈఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని కట్ర్యాల గ్రామంలో చోటు చేసుకుంది. కట్ర్యాల గ్రామానికి చెందిన రైతు చిర్ర కిరణ్ ఎకరం పొలం ఎస్సారెస్పీ కాలువ కింది భాగంలో ఉంది. వ్యవసాయం చేస్తూ ఆటో నడుపుతూ కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. తన పొలంలో దాదాపు 15సంవత్సరాల క్రితం సుమారు 200ఫీట్ల వరకు తవ్వించాడు. ఆనాటి నుంచి రెండు రోజుల క్రితం వరకు బోరు బావిలో నుంచి నీరు ఆగుతూ పోస్తూ ఉండేది. పక్కనే చిన్న కుంట సైతం ఉంది. అయినా ఆగే పోసేది. ఎకరం పొలం మాత్రమే కావడంతో ఉన్నదాంట్లో నీటిని సరిపెట్టుకున్నాడు.విచిత్రంగాఒక్కసారిగా నీరు ఏకంగా పైకి తన్నుకు వచ్చి ఉబికి పోస్తోంది.దీంతో రైతుఆనందంవ్యక్తం చేస్తున్నాడు.

గడువులోగా దేవాదులను పూర్తి చేయాలి

- అన్ని అడ్డకులను తొలిగించి పెండింగ్ పనులను వేగవంతం చేయాలి
- భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

వరంగల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిర్ణీత గడువలోగా దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేయాలని రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని దేవాదుల ప్రాజెక్టు పురోగతిపై రాష్ట్ర మంత్రి సీతక్కతో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పురోగతిని సమీక్షించారు.

ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రాజెక్టుకు అన్ని విధానపరమైన అడ్డంకులు తొలగించాలని, పెండింగ్ పనులను వేగవంతం చేయాలన్నారు. ఉత్తర తెలంగాణలోని కరువు పీడిత ప్రాంతాలలోని ప్రతీరైతుకు సాగునీటి ప్రయోజనాలు చేరేలా చూడాలని ఆదేశించారు. ములుగు జిల్లా గంగారం గ్రామం సమీపంలోని గోదావరి నది నుంచి 38.16 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేయడానికి దేవాదుల పథకం రూపొందిందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా హనుమకొండ, వరంగల్, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, జనగామ, యాదాద్రి, సూర్యాపేట, సిదిపేట జిల్లాల ఎగువకు 5.57లక్షల ఎకరాలకు సాగును అందించటమే లక్ష్యమన్నారు. మొత్తం నీటి పారుదల సామర్థ్యం 5.57 లక్షల ఎకరాలలో 3.17 లక్షల ఎకరాలకు ప్రస్తుతం సాగునీరు అందిస్తుందన్నారు. భూగర్భ జలాల ద్వారా సాగునీరు అందించి 58,028 ఎకరాలతో కలిపితే దేవాదుల మొత్తం సామర్థ్యం 6.14లక్షల ఎకరాలకు చేరుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. దేవాదులకు రూ.14,269.63కోట్లు ఖర్చు దేవాదుల ప్రాజెక్టుకు సవరించిన అంచనాల ప్రకారం రూ. 18,500కోట్లు కాగా, ఇప్పటివరకు ప్రాజెక్టు కోసం రూ.14,269.63 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇంకా మిగిలిన పనులు పూర్తి చేయడానికి రూ.4230 కోట్లు అవసరంగా గుర్తించామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఖర్చు చేసిన మొత్తంలో సివిల్ పనులకు రూ.11,667.85 కోట్లు, భూసేకరణకు రూ.1,343.06 కోట్లు, హైడ్రో మెకానికల్, ఎలక్ట్రో-మెకానికల్ ఇన్‌స్టాలేషన్‌లకు రూ.1,170.63కోట్లు ఖర్చు చేశామని వివరించారు. దేవాదుల ప్రాజెక్టు, దాని అనుసంధాన కాలువల కింద ఉన్న ఆయకట్టుకు ఉమ్మడి వరంగల్ ప్రాంతంలోని అనేక నియోజకవర్గాలలో విస్తరించి ఉందని అధికారులకు వివరించారు. మొత్తం 2,430.82 కిలోమీటర్ల కాలువలు తవ్వాల్సి ఉండగా, 1,663.10కి.మీ. తవ్వకాలు పూర్తయ్యాయని తెలిపారు. అలాగే 702.62కి.మీ. పైపులైన్లకు గాను, ఇప్పటివరకు 669.66కిలో మీటర్ల మేర పూర్తి చేశామని, కాలువ లైనింగ్ కూడా 799.80కి.మీ పూర్తి చేశామని తెలిపారు. జనగామ జిల్లాలో రఘునాథపల్లి, ఆర్ఎస్ ఘన్‌పూర్ విభాగాలలోని 51,000 ఎకరాలతో సహా దాదాపు 88,000 ఎకరాలకు సాగు నీరు అందించనున్నామన్నారు. గండిరామారం కుడి ప్రధాన కాలువ మాత్ర మే తాటికొండ కొత్తపల్లి, మీదికొండ, రాఘవపూర్, చాగల్, అశ్వారావుపల్లి, గోవర్ధనగిరి వంటి ఏడు గ్రామాల్లోని దాదాపు 5,600 ఎకరాలకు కవర్ చేస్తుందన్నారు.



సచివాలయంలో దేవాదుల ప్రాజెక్టుపై సమీక్షిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పాల్గొన్న ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి సీతక్క, ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు

హనుమకొండ, వరంగల్‌లలో ఆయకట్టు సామర్థ్యం 1.1లక్షల ఎకరాలకు మించి ఉండగా.. ములుగు, భూపాలపల్లి విభాగాలు కలిపి 1.2లక్షల ఎకరాలకు పైగా ఉన్నాయని వివరించారు. మిగిలిన ఆయకట్టు సిద్ధిపేట, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలోని రైతాంగానికి సాగునీటిని అందిస్తున్నామని తెలిపారు.

ఇంకా 2,307 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు కేఆర్.నాగ రాజు, యశస్వినిరెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ ప్రధానకార్యదర్శి రాహుల్‌బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, సలహాదారుడు ఆదిత్యనాథ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సకల ఏర్పాట్లు

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- పోటీ పడనున్న 936 మంది అథ్లెట్లు: సారంగపాణి

వరంగల్ స్పోర్ట్స్ అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16నుంచి 18వ తేదీ వరకు హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో నిర్వహించనున్న 5వ జాతీయస్థాయి ఓపెన్ అండర్-23 మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ పోటీలను జిల్లా అధికార యంత్రాంగం, వివిధ క్రీడాసంఘాల బాధ్యుల సమన్వయంతో విజయవంతం చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హనుమకొండలోని జేఎన్ క్రీడా మైదానాన్ని మేయర్ గుండు సుధారాణి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్‌బాజ్‌పాయ్, డీఎస్‌ఏ అధికారులు, క్రీడా పోటీల నిర్వహకులతో కలిసి సందర్శించి క్రీడా పోటీల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో నిర్వహించనున్న అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఏర్పాట్లను చేయాలని నిర్వహకులకు, అధికారులకు సూచించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి మాట్లాడుతూ.. అథ్లెటిక్స్ పోటీల్లో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి పలు అకాడమీలు, పలు యూనిట్స్ నుంచి 936మంది అథ్లెట్లు, 150 మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొంటారన్నారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ఐ) నిబంధనల మేరకు 52 ఈవెంట్లలో అథ్లెట్లు తమ ప్రతిభను నిరుపించుకోనున్నారని తెలిపారు. పోటీల్లో పాల్గొనే అథ్లెట్ల, సర్టిఫికెట్లు, జనన ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియను పూర్తి చేయాడానిక ఏఎఫ్ఐ నిపుణుల బృందం బుధవారం జేఎన్ స్టేడియానికి రానున్నారని సారంగపాణి తెలిపారు. వరల్డ్ అథ్లెటిక్స్ నిబంధనల మేరకు జరిగే ఈ పోటీల్లో పాల్గొని అథ్లెట్లకు డోపింగ్ పరీక్షలతో పాటు టైమింగ్ స్కోరింగ్ రిజల్ట్ (టీఎస్ఆర్), ప్రపంచ వ్యాప్తంగా క్రీడా పోటీలు వరల్డ్ లైవ్ టెలికాస్ట్ చేయబడుతుందన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న రన్స్, త్రోస్, జంప్స్ (ట్రాక్ అండ్ ఫీల్డ్) పోటీలు ఉదయం 6నుంచి 10: 30గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి 5:30గంటల వరకు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు, డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్, జీడబ్ల్యూఎం సీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, ఎంజీఎం ఆర్ఎంవో ముదిలి వసంతరావు, జీడబ్ల్యూఎంసీ సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పి.రమేష్‌రెడ్డి, జీడబ్ల్యూఎంసీ సానిటరి సూపర్‌వైజర్ బేర నరేందర్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.



జేఎన్ఎస్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్

21న దీపావళి నోములు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పరమపవిత్రమైన గౌరీ కేదారీశ్వరనోములను ఈనెల 21న మంగళవారం రోజున ఆచరించుకోవాలని భద్రకాళి దేవస్థానం ప్రధానార్చకుడు భద్రకాళి శేషు తెలిపారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ..ఈ నెల 20న నరక చతుర్ధశి సందర్భంగా సూర్యోదయానికి ముందే స్నానాలు ఆచరించి హారతులు తీసుకోవాలని అన్నారు. ఆ రోజున పవిత్రమైన గంగాజలం ప్రతీ నీటి చుక్కలో చేరుతుందని, తైలంలో లక్ష్మీదేవి చేరుతుందని, సూర్యోదయానికి ముందు తైలం రాసుకొని స్నానమాచరిస్తే గంగా లక్ష్మీదేవిల అనుగ్రహం కలుగుతుందని అన్నారు. ఈనెల 20న సూర్యోదయానికి ముందు, సూర్యోదయం తర్వాత హారతులు తీసుకోవచ్చన్నారు. 21న కేదారీశ్వర వ్రతాలు ఆచరించుకోవాలని బుధవారం రోజున నోములు కదిలించుకోవాలని అన్నారు. స్వాతి నక్షత్రం లేనందున ఈసారి కొత్త నోములు లేవని, కుటుంబంలో ఎవరైనా కాలం చేసి నోములు ఆగిన వారు స్వాతి నక్షత్రంతో సంబంధం లేకుండా నోముకోవచ్చని వివరించారు.

ఈనెల 22నుంచి శివ కేశవులకు ప్రీతికరమైన కార్తీక మాసం ప్రారంభమవుతుందని తెలిపారు. కాగా, దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని 21న భద్రకాళి అమ్మవారికి ధనలక్ష్మి పూజ చేసి నాణేలతో ధనార్చన జరిపి మంగళహారతులు దీపారాధనలు నిర్వహిస్తామని తెలిపారు. పూజ అనంతరం ధనార్చన చేసిన నాణేలను భక్తులకు ప్రసాదంగా ఇస్తామని శేషు వివరించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ములుగు
బుధవారం 15 అక్టోబరు 2025

తెలంగాణ రైజింగ్ విజన్-2047

సర్వేలో పాల్గొనాలి

• రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ విజన్-2047 డాక్యుమెంట్‌ను రూపొందిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు. డాక్యుమెంట్ రూపకల్పలో ప్రతి ఒక్క పౌరుడి భాగస్వామ్యం ఉండేలా ఈనెల 25న నిర్వహించే సర్వేలో ప్రజలు, ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సర్వే లింకును, క్యూఆర్‌కోడ్‌ను ఆయా కార్యాలయాల్లో ప్రదర్శించాలని ఆదేశించారు. అలాగే ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని పేర్కొన్నారు.

సువర్ణ పుష్పార్చన



చిలుకూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అష్టదళ పాదపద్మారాధన పూజను పురస్కరించుకుని చిలుకూర్ గుట్ట బుగులు వేంక న్న ఆల యంలో మంగళవారం సువర్ణ పు ష్పార్చన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టా రు. రూ.80లక్షల విలువైన 108 సువర్ణ పు ష్పాలతో వేంకన్న పాదాలకు ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం దేవస్థానం ట్ర స్టు బోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఈ వో భాగం లక్ష్మీప్రసన్నతో పాటు, ధర్మకర్తలంతా హాజరై ఒక్కొక్కరు రూ.516 ప్రత్యేక సేవా రుసుంతో పూజలు నిర్వహించారు.

వర్షానికి దెబ్బతిన్న పత్తి పంటలు



మల్హర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు పత్తి రైతులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. మబ్బులకు తోడు వర్షాల వల్ల పత్తి పంట ఎర్రబారుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి పంట ఎర్రబారడంతో పాటు తెగుళ్ల వల్ల కూడా గూడు నల్లబారి కాయలు రాలిపోతున్నట్లు అంటున్నారు. మండల కేంద్రమైన తాడిచర్ల, మల్లారం, పెద్దతూండ్లతో పాటు పలు గ్రామాల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. ఎన్ని మందులు కొట్టినా లాభం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఒక్కో ఎకరానికి రూ 30 నుంచి 50 వేల వరకు పెట్టుబడి పెట్టామని రైతులు తెలుపుతున్నారు. పత్తి వల్ల లాభాలు దేవుడెరుగు పెట్టిన పెట్టుబడి కూడా వెళ్లేలా లేదని దిగుతు చెందుతున్నారు.

అటవీ శాఖ దాడులు ఆపాలి

తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న తెలంగాణ ఆదివాసీలు, గిరిజన సంఘం నాయకులు

ఏటూరునాగారం రూరల్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బతుకుదెరువు కోసం వలస వచ్చిన ఆదివాసీలపై అటవీశాఖ దాడులు చేయడం అత్యంత దారుణమని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దామోదర్ మండిపడ్డారు. దాడులకు పాల్పడుతున్న అటవీ శాఖ అధికారులపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం వద్ద వలస ఆదివాసీలు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ వలస వచ్చిన ఆదివాసీపై అటవీ శాఖ దాడులు చేస్తూ వారికి జీవనోపాధిని దూరం చేస్తోందని విమర్శించారు. కన్నాయిగూడెం, తాడ్వాయి మండలాల్లోని ఆదివాసీ గ్రామాల్లో సాగులో ఉన్న పోడు భూముల్లో అటవీశాఖ అధికారులు దౌర్జన్యంగా కందకాలు తవ్వి ఇబ్బం దులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీలపై దాడులకు పాల్పడుతున్న ఫారెస్టు అకారులపై ప్రభుత్వం తక్షణమే అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చొరవ చూపి పోడుభూముల్లో కందకాలు పనులను వెంటనే ఆపేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అనంతరం ఎస్‌వో రాజ్‌కుమార్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు దుర్గి చిరంజీవి, పూనెం నగేష్, కుర్సం చిరంజీవి, ఊకే ప్రభాకర్, తోలెం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి

మహదేవపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వరం బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నగునూరి రమేష్ గౌడ్ కాంగ్రెస్‌లో చేరారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా మంగళవారం కండువా కప్పుకు న్నారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లేతకారి రాజబాపు ఆధ్వర్యంలో రమేష్‌గౌడ్ పార్టీలో చేరారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ



మృతురాలు కుటుంబాన్ని పరామర్శిస్తున్న వెంకటరమణారెడ్డి

టేకుమట్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకి ష్టాపూర్ (టి) గ్రామానికి చెందిన కట్ల లింగక్క మంగళవారం అనారోగ్యంతో మరణించగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. రామకిష్టాపూర్(టి) బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కట్ల శ్రీను తల్లి కట్ల లింగక్క అనారోగ్యంతో మృతి చెందగా భౌతికకాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి, మండల ప్రధాన కార్యదర్శి ఆకు నూరి తిరుపతి, నాయకులు ఆది రఘు, బందెల నరేష్, పోతనవేణి ఐలయ్య, నేరేళ్ల శ్రీనివాస్, కొండ్ర ఓదెలు, అఫ్జల్, అచ్చె లచ్చయ్య, సాద మహేం దర్, నిమ్మల స్వామి, గినవేణి భాస్కర్, బొండ్ల సతీష్, నూనేటి కుమారస్వామి, అరుణ్ కుమార్, నూనేటి రాజు, సాద తిరుపతి, రాం రాంచదర్, కొలుగూరి నాగరాజు తదితరులు ఉన్నారు.

పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్య పరిరక్షణ

కాటారం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని సీడీపీవో రాధిక అన్నారు. మండలంలోని కొత్తపల్లి జీపీ పరిధిలోని జడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం పోషణ మాసోత్సవం సందర్భంగా సూపర్‌వైజర్ శివరాణి నేతృత్వంలో అంగన్‌వాడీ టీచర్లు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీవో రాధిక పిల్లల తల్లులు, గర్భిణులు, కిశోర బాలికలకు పోషకాహార ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణలో, పరిసరాల్లో పెంచిన ఆకుకూరలు, పండ్లతో పాటు పాలు, గుడ్లు, పప్పు, చిరుధాన్యాలు, కూరగాయలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలోజడ్పీహెచ్ఎస్ హెచ్ఎం శారద, అంగన్వాడీ టీచర్లు సులోచన, శ్రీలత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

అందుకుతండాలో మాసోత్సవం

చిట్యాల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అందుకుతండా గ్రామంలో పోషణ మాసోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బలవర్ధక ఆహార పదార్థాలను ప్రదర్శించి మహిళలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ జయప్రద, హెచ్ఎంలు ప్రతాప్, శ్రీనాథ్ చిరుధాన్యాలు, మొలకెత్తిన గింజలను తినడం మూలంగా ఆరోగ్యవంతులుగా తయారవుతారని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు కస్తూరి, రజిత, ప్రమీల, మమత, ఉమాదేవి, అనూష, స్వప్న, ఏఎన్ఎం లావణ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమన్‌పల్లిలో..

టేకుమట (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, శిశువులకు అన్న ప్రాసన, అక్షరాభ్యాసం చేశారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ సరోజన, ఏకేపీ ఏపీఎం మంజుల, ఏఎన్ఎం సునీత, ఆశా రమ, ఎంఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్లు మమత, అనూష తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు లారీలను అడ్డుకుంటూనే ఉంటాం

మల్హర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను పరిష్కరించేంత వరకు బొగ్గు లారీలను అడ్డుకుంటూ ఉంటామని టిప్పర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. కొయ్యూర్ శివారులో డాంబర్ ప్లాంటు వద్ద బొగ్గు లారీలను మంగళవారం అడ్డుకున్నారు. ఐదు రోజులుగా తమ టిప్పర్లను పక్కన పెట్టి సమ్మె చేస్తుంటే కాంట్రాక్టర్లు ఇదేమీ పట్టనట్టు టాన్స్‌పోర్టు టిప్పర్లను నడపడం సరికాదన్నారు. బొగ్గు లారీలను అడ్డుకున్న విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వారికి నచ్చజెప్పె ప్రయత్నం చేశారు. ఎన్ని భయభ్రాంతులకు గురి చేసినా సమ్మె విరమించేది లేదని అసోసియేషన్ సభ్యులు తేల్చి చెప్పారు. దీంతో తాడిచర్ల నుంచి చెల్పూర్ కేటీపీపీకి బొగ్గు రవాణా నిలిచిపోయింది.

సీటు ఒక్కటే.. ఆశావహులు అనేకం!

కాంగ్రెస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్ష పదవికి భారీగా పోటీ

రెండు నియోజకవర్గాల నుంచి 46 దరఖాస్తులు



భూపాలపల్లిటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి భారీగా పోటీ నెలకొంది. సీనియర్లు, జూనియర్లు అని తేడా లేదు. ప్రతి ఒక్కరూ దరఖాస్తు సమర్పించుకుంటున్నారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల నుంచి 46 దరఖాస్తులు వచ్చినట్లు నాయకులు తెలిపారు. ఆశావహుల సంఖ్య భారీగా ఉండ టంతో ఈ దరఖాస్తులకు జల్లెడ పడుతున్నట్లు తెలిసింది. ఆరుగురి ఎంపిక చేసి వారిలో ఒకరిని ఫైనల్ చేయనున్నట్లు సమాచారం. ఈ ఎన్నిక ప్రక్రియ కూడా దీపావళి లోపే చేయాలని ఆదేశాలు ఉన్నట్లు జిల్లా నాయకులు తెలిపారు.

అభిప్రాయం చెప్పండయ్య అంటే..

జిల్లా అధ్యక్ష పదవికి ఆదివారం వరకు 12 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. సోమవారం ఏఐసీసీ నుంచి జిల్లా అబ్జర్వర్ జాన్సన్ అబ్రహం వచ్చిన నేపథ్యంలో ఒక్కసారిగా అవి 46కు చేరాయి. అధ్యక్ష పదవికి ఎవరు అర్హులైన అంశంపై అభిప్రాయ సేకరణ కోసం జిల్లాలోని పలువురు నాయకులను పిలవగా వచ్చిన వారు సైతం దరఖాస్తు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. దరఖాస్తుల స్వీకరణ ముగిసాక ముగ్గురు నాయకులు తనకు ఇష్టం వచ్చినట్లు అభిప్రాయాల సేకరణకు సంబంధించిన ఫారాల జిరాక్స్ తీసుకుని వారి అనుయాయులతో సంతకాలు చేయించి అబ్జర్వర్‌లకు ఇవ్వడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ నేపథ్యంలో పలువురు నాయకులు ఈ విషయాన్ని వ్యతిరేకించినట్లు సమాచారం. కొంతమంది ప్రస్తుతం ఉన్న అయిత ప్రకాష్‌రెడ్డినే మరలా అధ్యక్షుడుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పడం చర్చనీయాంశమైంది. ఇదిలా వుండగా దీపా వళి ఇంకా ఐదు రోజులు మాత్రమే ఉండగా అధ్యక్ష పదవి ఎంపిక ప్రక్రియను ఎప్పుడు పూర్తి చేస్తారోనని ఉత్కంఠతో నాయకులు ఎదురుచూస్తున్నారు. అలాగే కొత్తగా ఎవరినీ ఎంపిక చేయకుండా పాత వారినే కొన సాగించనున్నారనే చర్చ కూడా జోరుగా సాగుతోంది.

మంత్రి, ఎమ్మెల్యేల ప్రత్యేక దృష్టి

జిల్లా అధ్యక్ష పదవిని ఎంపిక చేయడంలో జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డితో పాటు ఇక్కడికి వచ్చిన అబ్జర్వర్లు సోమవారం కాకతీయ గెస్ట్‌హౌస్‌లో కూర్చుండి కొంతసేపు చర్చలు కూడా జరిపారు. జిల్లా అధ్యక్ష పదవిలో ఎవరిని ఎంపిక చేయాలనే విషయమై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి చర్చించినట్లు సమాచారం. ఈ క్రమంలో వారి అభిప్రాయాలు చెప్పినట్లు తెలుస్తోంది. ఏదేమైనా పార్టీ పటిష్ఠతకు భంగం కలగకుండా ఉండేలా వారు తీసుకునే నిర్ణయాలు ఉండబోతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గంగారం గ్రామ పంచాయతీని సందర్శించిన డీపీవో

కాటారం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారం గ్రామ పంచాయతీ పరిధిలో జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) శ్రీలత మంగళవారం పర్యటించారు. జీపీ కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ చేశారు. పల్లెప్రగతి పనులను, పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. నిరంతరం పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేయించాలని పంచాయతీ కార్యదర్శి కరుణాకర్‌ను ఆదేశించారు. జీపీ పరిధిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కరుణాకర్, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మల్హర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అప్పాల కొమరయ్యకు వెన్నముకకు సంబంధించిన శస్త్ర చికిత్స జరిగ్గా ఆయన్ను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు నారాయణ, బుడిగె వెంకటేష్, లక్ష్మన్, వెంకటచారీ, సత్యనారాయణ, పెద్ద లింగయ్య, నౌళ్ల సంపత్, వెంకటస్వామి, రవి, సతీష్, పగడాల రాము, కార్తీక్ ఉన్నారు.

రామప్ప చైర్మన్ రేసులో సతీష్

మరో ఇద్దరు కాంగ్రెస్ నేతలు కూడా



వెంకటాపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలో గల రామప్ప రుద్రేశ్వరస్వామి దేవాలయ చైర్మన్ రేసులో మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బేతి సతీష్ యాదవ్ ఉన్నట్లు తెలుస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రామప్ప దేవాల యానికి చైర్మన్ నియామకాన్ని చేపట్టలేదు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం రామప్ప దేవాలయ చైర్మన్ నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ క్రమంలో ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు, ఐజేయూ ములుగు జిల్లా ఉపాధ్యక్షుడు బేతి సతీష్ యాదవ్ రామప్ప చైర్మన్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది.

ములుగు జిల్లా ఉద్యమంలో జర్నలిస్టుగా సతీష్ తనవంతు పాత్ర పోషించారు. మంత్రి సీతక్కకు నమ్మినబంటు కావడంతో ఆమె ఆశీస్సులు సైతం ఆయనకు ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా రామప్ప చైర్మన్ పదవి కోసం మండలంలోని రాజేశ్వర్‌రావుపల్లి గ్రామానికి చెందిన వేముల చంద్రాకర్ రెడ్డితో పాటు మండల కేంద్రానికి చెందిన మిల్కూరి ఐలయ్య సైతం బరిలో ఉన్నట్లు తెలుస్తోంది.

నేడు సీఎం రాక

హనుమకొండ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం హనుమకొండకు రానున్నారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి దొంతి కాంతమ్మ 'మాతృయజ్ఞం' కార్యక్రమం హనుమకొండ వడ్డెపల్లిలోని పీజేఆర్ గార్డెన్స్‌లో జరుగనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రేవంత్‌రెడ్డి వస్తున్నారు. ఆయన రాక కోసం కాంగ్రెస్ నేతలు, అధికార యంత్రాంగం ఏర్పాటు చేశారు. సీఎం మధ్యాహ్నం 1 గంటకు సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలోని హెలిపాడ్‌కు చేరుకుంటారు. 1.05 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి వడ్డెపల్లి పీజేఆర్ గార్డెన్స్‌కు చేరుకుంటారు. 1.15 నుంచి 1.45 గంటల వరకు దొంతి కాంతమ్మ స్మారకార్థం జరిగే 'మాతృయజ్ఞం' కార్యక్రమంలో పాల్గొంటారు. 2 గంటలకు హైదరాబాద్‌కు హెలికాప్టర్‌లో తిరిగి వెళతారు.

ఏర్పాట్లను పరిశీలించిన సీపీ

వరంగల్ క్రైం (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి దశదిన కర్మకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం రానున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను సీపీ సన్‌ప్రీత్‌సింగ్ మంగళవారం సాయంత్రం పరిశీలించారు.

కార్యక్రమం జరిగే కాజీపేట 100 ఫీట్ల రోడ్డులోని పీజేఆర్ గార్డెన్‌తో పాటు హెలీకాప్టర్ ల్యాండ్ అయ్యే ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌ను సందర్శించారు. అధికారులు, సిబ్బం దికి భద్రత చర్యలపై పలు సూచనలు చేశారు.

కాళేశ్వర ఆలయంలో కాలసర్పదోష పూజలు

మహదేవపూర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో మంగళవారం కాలసర్పదోష పూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వీటితోపాటు నవగ్రహ, కుంకమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయాన్నే వచ్చిన భక్తులు గోదావరి నదిలో పవిత్ర స్నానం ఆచరించి దోషనివారణ పూజల్లో పాల్గొన్నారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

కాటారం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం నుంచి నెల రోజుల పాటు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ (ఎఫ్ఎండీ)టీకాలు వేసే కార్యక్రమం చేపడుతున్నట్లు మండల వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ రమేష్, డాక్టర్ ధీరజ్ తెలిపారు. కాటారం, ధన్వాడ, ఒడిపిలవంచ పశువైద్యశాలల పరిధిలోని గ్రామాల్లో ఆవు, గేదె జాతులకు సంబంధించిన పశువులకు పశు సంవర్ధక శాఖ ద్వారా ఉచితంగా ఎఫ్ఎండీ (గాలికుంటు వ్యాధి)నివారణ టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

వాజేడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు, అధ్యాపకులకు కార్డియో పల్మనరీ రెసస్కిటేషన్ (సీపీఆర్)పై వాజేడు పీహెచ్‌సీ వైద్యాధికారి మధుకర్ మంగళవారం అవగాహన కల్పించారు. ఎవరైనా గుండెపోటుకు గురైతే వెంటనే ఈ ప్రక్రియ ద్వారా బతికించుకొనే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. సీపీఆర్ చేసిన అనంతరం ఆస్పత్రికి తరలిం చాల్సి ఉంటుందని అన్నారు.

బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

గోవిందరావుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మడికొండ రమేష్ అనారోగ్యంతో బాధపడుతుండగా మంగళవారం మండల బీఆర్ఎస్ నాయకులు ఆయనను పరామర్శించారు. ఆయన ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. చిన్న వయసులో గుండెపోటు వచ్చి స్టంట్ పడడం దురదృష్టకరమని అన్నారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహనాయక్, నాయకులు సూడి శ్రీనివాసరెడ్డి, లావుడ్యా రాంచందర్‌నాయక్, ఎలేందర్, దర్శనాల సంజీవ, సంతోష్, కుమార్, రమేష్, ఎర్ర వెంకన్న, టి.వెంకన్న, గోపి, మల్లయ్య, బిక్కు, హరిసింగ్, తదితరులు ఉన్నారు.

మేడారం అభివృద్ధిపై విమర్శలు సరికాదు

ఏటూరునాగారం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతర అభివృద్ధి పేరుతో దోపిడీ జరుగుతోందంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు సరికాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ మండల కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశం ఆయన మాట్లాడారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి విష ప్రచారం చేస్తూ మేడారం సమ్మక్క-సారలమ్మ తల్లుల ఖ్యాతిని చెడగొట్టేందుకు ప్రయ త్నిస్తున్నారని మండిపడ్డారు. మేడారం అభివృద్ధి పనులను చూసి ఓర్చుకోలేక ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

పారదర్శకంగా డీసీసీ అధ్యక్షుడి ఎంపిక

(5వ పేజీ తరువాయి)

ఉండదని స్పష్టం చేశారు. అధిష్ఠానానిదే తుది నిర్ణయమని, కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఓబీసీ, మహిళలు ఇలా అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం చేసే దిశగా కృషి చేస్తుందని అన్నారు. పార్టీ కోసం కష్టపడేవారిని గుర్తిం చడంతోపాటు సమర్థులైన నాయకులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు సంబం ధించి అందరి అభిప్రాయాలను సేకరించడం తోపాటు అభ్యంతరాలను కూడా పరిశీలిస్తామన్నారు. అనంతరం జాన్సన్ అబ్రహంకు పైడాకుల అశోక్, మల్లాడి రాంరెడ్డి, గొల్లపల్లి రాజేం దర్‌గౌడ్, ఇర్సవడ్ల వెంకన్న, చిడెం రామ్మోహన్ రావు, సూరపనేని నాగేశ్వర్‌రావు తదితరులు డీసీసీ అధ్యక్ష పదవి కోసం నామినేషన్ పత్రాలను అందజేశారు. టీపీసీసీ పరిశీ లకులు సాగరికరావు, నాగేందర్‌రెడ్డితోపాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.